


– 8 –

# నేనొక కూర మొక్కకడ నిలిచి...



అది అమెరికాలో సంధ్యా సమయం..అంటే మా హ్యూస్టన్ లో....అదే బోస్టన్ లో నిద్రపోయే సమయం. కాలిఫోర్నియా లో మధ్యాహ్నం కునుకు తీసే సమయం... ఇండియాలో పొద్దున్నే లంచాలు ఇచ్చి పుచ్చుకునే మధుర క్షణాలు.

కథల్లో అయితే అది పక్షులు కువ కువ లాడుతూ గూటికి చేరుకునే సమయం. కానీ మా కాంక్రీటారణ్యం లో పక్షుల కువకువలు వినాలంటే టీవీ పెట్టుకోవాలి...లేదా వంద మైళ్ళు కారులో కీకారణ్యానికి వెళ్లి డేరా వేసుకుని పడుకోవాలి. సముద్ర తీరానికి వెళ్ళవచ్చును కానీ ఆ బాపతు కొంగలు చూచుటకు మాత్రమే బావుండును. అవి నిశ్శబ్దంగానే ఎగురును.



సాయంత్రం నాలుగు నుంచి ఆరు దాకా అందరి అమెరికన్ పౌరులు, ట్రంప్ గారు ఎప్పుడు గెంటేస్తారో అని మరింత బుద్ధిగా ఉండే ప్రవాస అమెరికన్లు ...అందరూ...ఇండియా లో లాగా గయ్యో మని కారు హారన్లు మోగించకుండా చడీ చప్పుడూ లేకుండా గూటికి చేరుకునే ఆ సంధ్యా సమయంలో నేను కూడా ఇంటికి చేరుకున్నాను.

ఆ సమయంలో మా క్వీన్ విక్టోరియా గారు ఎప్పటి లాగానే అమెరికా మేష్టారు పడుకునే గదిలో..అనగా...మాస్టర్ బెడ్రూమ్ లో విశ్రమిస్తున్నారు. ఏలననగా ఆవిడ అర్ధరాత్రి పని చేసే అక్కుపక్షి. ఇంట్లోకి వెళ్ళగానే నా రోజువారీ అలవాటు ప్రకారం మా మంచు పెట్టె...అనగా


రిఫ్రిజిరేటర్ తెరిచాను. లోపల నుంచి నాకేసి ఒక బీర కాయ జాలిగా చూస్తోంది. అబ్బా..బీరకాయ అంటే ద్రావకం సీసా కాని రేకు డబ్బా కానీ కాదు. చైనీస్ స్క్వాష్ అని అమెరికన్లు పేరు పెట్టిన మన ఆంధ్రా బీరకాయ..కేవలం చైనా మరియు గుజరాతీ వాళ్ళ కొట్లలోనే దొరుకుతుంది. దాని పుట్టుక ఫ్లోరిడా లోనా, టెక్సస్ లో పటేల్ గారి తోటలోనా అన్న విషయాన్ని బట్టి అవి కాస్త పొట్టీ, పొడుగూ, అప్పుడప్పుడు బొద్దుగానూ, లేదా నీరసంగా, పీలగా ఉంటాయి....అవన్న మాట. ఈ బీరకాయ ఇప్పుడు నాకేసి జాలిగా చూడడానికి కారణం అది కొని వారం దాటినా మా క్వీన్ విక్టోరియా దాని జోలికి వెళ్ల లేదు. దానికి ఒళ్ళు ఒరిసి పోయి, శరీరం మెత్తగా అయిపోయి, రేపో మాపో అన్నట్టుగా ఉండి "నన్ను ఉల్లిపాయ కారంతో కూర చేస్తావా, లేక నా తొక్క, తోలుతో సహా కలిపి పచ్చడి చేస్తావా?, లేక నిర్దాక్షిణ్యంగా చెత్త బుట్ట లోకి విసిరేస్తావా? ఎలాగా నన్ను నా అమ్మ పాదు నుంచి కసిగా కోసేసి ఈ చలి పెట్టె లో వారం క్రితం కుక్కేశావు కదా... నీకు దయ లేదా? కనీసం వీర బీర చావు అయినా చావనివ్వవా?" ఇన్ని డైలాగులు నాకు ఆ బీర చూపులో కనపడ్డాయి. నాకూ, మా క్వీన్ విక్టోరియాకి విపరీతమైన భేదాభిప్రాయాలు వచ్చే ప్రదేశాలలో ఈ రిఫ్రిజిరేటర్ అనేది ఒకటి. మిగిలిన పెద్ద లిస్టు వ్రాయడానికి ఇక్కడ చోటు లేదు. ప్రతీ వారం నేను ఎంతో ఆశగా నాకు నచ్చే కూరలు కొనుక్కురావడం, అవి ఆవిడకి నచ్చక, ఇలా ఫ్రిజ్ లో మగ్గబెట్టడం, ఇక తప్పక నేను వాటిని బయట పారేస్తే ..ఇదిగో ఇలాగ నేను 'నిర్దయగా" వాటిని బయట పారేస్తున్నాను అనే అపఖ్యాతి పొందడం.

ఇంకా కొస ప్రాణంతో ఉన్న ఆ బీరకాయని ఇప్పుడు ఏం చెయ్యాలా అని అలోచిస్తూ ఉండగా టీవీలో పెద్ద హడావుడి నా సెల్ ఫోన్ లో టింగు టింగు మంటూ నాలుగు ఎమర్జెన్సీ మెసేజ్ లు వచ్చి పడ్డాయి. తీరా చూస్తే అది మరో కొద్ది గంటలలో రానున్న అతి దారుణమైన హరికేన్ హార్వే...వారి లెక్క ప్రకారం అది గత నలభై ఏళ్లలో అలాంటి తీవ్రమైన తుఫాను రాలేదుట. అంచేత అందరూ వారంరోజుల పాటు వారికి కావలసిన కూరలు, పాలు, మజ్జిగ, వారి వారి వ్యక్తిగత పరిస్థితిని బట్టి భార్యామణికి చెప్పో, చెప్పకుండానో ఇతర అత్యవసర ద్రావకాలు కూడా కొనుక్కుని జాగ్రత్త పడమనీ, ఒక వేళ వరదలు ఎక్కువై ఇల్లు ఖాళీ చెయ్యడానికి కూడా తయారుగా ఉండమనీ, ఎట్టి పరిస్థితులలోనూ ఇల్లు కదిలి బయటకి వెళ్ళవద్దు అనీ పదే, పదే హెచ్చరికలు జారీ చేశారు.

అది చూడగానే నేను మా బీరకాయని చూసి "ఇక నీకేం భయం లేదు. త్వరలోనే మా క్వీన్ విక్టోరియా నీకు మోక్షం కలిగించే అవకాశం వచ్చింది." అని హామీ ఇచ్చి...నేను మా తోట లోకి వెళ్లి,

ఒకానొక కూర మొక్క కడ నిలిచి , చివాలున కొమ్మ వంచాను...అంతా ఘంటసాల – జంధ్యాల పాపయ్య శాస్త్రి టైపులో.

ఆ కూర మొక్క నా కంటే రెండు అడుగులు ఎత్తులో ఉన్నది కాబట్టే ఆ పైన ఎక్కడో కాచిన ఆ నాలుగు బెండ కాయలు కోయడానికి కొమ్మని 'చివాలున' వంచ వలసి వచ్చింది. అప్పుడు అమెరికాకి, ఇండియాకి ప్రధానమైన తేడా ఏమిటో నా బుర్రకి తట్టింది. అది బెండ మొక్కల ఎత్తులో ఉన్న తేడా. ఇండియాలో మనం బెండ కాయలు కానీ, వంకాయలు కానీ కొయ్యాలంటే కిందకి నడుం వంచాలి. ఎందుకంటే ఎంత యూరియా వేసి పెంచినా అవి మూడు అడుగులు దాటి ఎదగవు, అదే అమెరికా లాగానే వాళ్ళ లాగా ఆరడుగులు సునాయాసంగా ఎదిగిపోతాయి, మరియు యూరియా వెయ్యక్కర లేదు. ఈ నేలా, ఈ గాలీ..మహత్తు.



అసలు ఈ ఏడు మొదట్లో ఏం జరిగిందంటే, నేను పైన ఉదాహరించిన ఫ్రిజ్ పోరాటంలో మా క్వీన్ విక్టోరియా సునాయాసంగా గెలిచింది. అనగా నేను చిత్తుగా ఓడిపోయాను అని ఎవరైనా అనుకున్నా నేను ఏమీ అనుకోను. అప్పుడేం చేశానంటే...ఆ కూరలు ఏవో మన తోటలోనే వేసుకుంటే..అవసరం వచ్చినప్పుడు ఆవిడే వెళ్లి అప్పటికప్పుడు కోసుకుంటుంది కదా...వెళ్లి కొట్లో కొనుక్కుని, ఫ్రిజ్ లో వాటిని చంపేసి డబ్బు తగలెయ్యడం ఎందుకూ..ఆ డబ్బేదో మన ఇంటి వెనకాలే తగలెయ్య వచ్చు కదా అని ఓ నిర్ణయానికి వచ్చాను. ఆ ప్రకారం బెండ, వంగ, చిక్కుడు పాదు, నాలుగు గోంగూర మొక్కలు, ఓ బచ్చలి మొక్కా, నాలుగు టొమేటో మొక్కలు, అరటి చెట్లూ వగైరాలు వేశాను. వీటిల్లో బెండ మొక్కలు అరివీర భయంకరంగా పెరిగాయి. ఆ పక్కనే వేసిన బచ్చలి తన దారిన తను పోకుండా, పక్కనే ఉన్న ఓ బెండ మొక్కని కావిలించుకుని కులాసా చేస్తోంది. ఎప్పుడో క్రిందటేడు ఎక్కడో వేసిన బెండకి కాసి ఎండి పోయి విత్తనాలుగా మారిపోయి వాటంతట అవే ఎగిరి ఎక్కడ పడితే అక్కడ మొలిచినవి మరి కొన్ని. చెప్పొద్దూ, నిజానికి నేను కొనుక్కొచ్చి వేసిన వాటి కంటే ఈ అప్పనంగా మొలిచిన మొక్కలే భలే ఆరోగ్యంగా ఉన్నాయి. ఇవి అటు గులాబీల్లోనూ, కర్వేపాకు లోనూ...ఒక్కొక్కటి కనపడుతూ ఉంటాయి. కావాలంటే ఇక్కడ జతపరిచిన ఫొటోలు కొన్ని చూడండి. ఆఖరికి గోంగూర కూడా నా కంటే ఎత్తుగా పైన పాదుల కోసం వేసిన పందిరిని చీల్చుకుని ఎదిగిపోవడం కాస్త సిగ్గుగానే ఉంది. ఎందుకంటే అసలు ఎవరైనా గోంగూర ఆకులూ, బెండ కాయలూ కొయ్యడానికి పెద్ద స్టూల్ వేసుకుని ఎక్కుతారా? సిగ్గేయ్యదూ?



అన్నట్టు హరికేన్ హర్వే మాట ఏమిటీ అంటే....వారం రోజుల పాటు "హౌస్ అరెస్ట్" లో ఉన్నాం. చుట్టు పక్కల అన్ని రోడ్లూ కాలవలు అయిపోయాయి....మా రోడ్డు తో సహా.... మా తోట లోకి వెళ్లి చూస్తే....ఇంకేముందీ? అన్నీ మొహాలు వేళ్ళాడేసుకుని నేల మీదకి ఒరిగిపోయి..నా కేసి దీనంగా చూస్తున్నాయి. ఇప్పుడు మనం ముక్కాలి పీట ఎక్కడం అవసరం లేదు అని సంతోష పడుతూ ఉంటే మా అమ్మాయి 'అమ్మా, ఇదిగో గోంగూర. ఫ్రెష్ గా పచ్చడి చెయ్యి" అంటూ ఆనందంగా గోంగూర పట్టుకొచ్చిన ఫోటో ఇక్కడ చూడండి. అలాగే కర్వేపాకూ, బచ్చలీ, బెండా కూడా పెనవేసుకొనే వాలిపోయాయి...కానీ చింత చచ్చినా పులుపు చావ లేదు సుమా.

ఏది ఎలా ఉన్నా, నాకు హ్యూస్టన్ లో సాహిత్య సేవకి బాగా ఉపయోగ పడుతున్నది మా ఇంట్లో కర్వేపాకు మొక్కలే. క్రిందటేడు ఆ రెండూ పది అడుగుల చెట్లలా ఎదిగాయి. ఎప్పుడైనా మా నెల నెలా తెలుగు వెన్నెల కి జనం రావాలీ అనిపిస్తే వెంటనే ఆ ప్రకటనలో "ఈ రోజు సదస్సుకు వచ్చిన వారికి ఇరవై రెబ్బలు కరివేపాకు బహుమానం" అని ప్రకటిస్తే చాలు. హాలు నిండిపోయేది. ఎందుకంటే బజార్లో డాలర్ కి నాలుగు రెబ్బలు కొనుక్కోవాలి. సాహిత్యానికి విలువ పెంచాలంటే కర్వేపాకు పంచి పెట్టాలి అని మేము కనిపెట్టిన కొత్త సూత్రం.

యురేకా....

నెల్లాళ్ళ నుంచీ నన్ను వేధిస్తున్న ఒక సమస్యకి ఇప్పుడు 'యురేకా' ముహూర్తం వచ్చింది... ఈ నెల సెప్టెంబర్ 23–24, 2017 తేదీలలో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి వాషింగ్టన్ DC లో జరుగుతున్న 10వ అమెరికా తెలుగు సాహితీ సదస్సు , స్థానిక రాజధాని ప్రాంత తెలుగు సంఘం వారి సహకారంతో జరుగుతోంది కదా. దానికి జనాలని ఎలా తోలుకు రావాలా అని ఆలోచిస్తూ ఉండగా...అవును కదా.... ఆ సభలకి వచ్చిన వారికి ..యస్....టెక్సస్ కర్వేపాకు ఉచితంగా ఇవ్వబడును అని ప్రకటిస్తే సరిపోతుందిగా...జనం ఎగబడిపోతారు....చారులోకే కాదు, సాహిత్యానికి కూడా కర్వేపాకే గతి మరి!

ఈ కర్వేపాకుకీ తెలుగు సాహిత్యానికీ ఉన్న అవినాభావ సంబంధం మాట చంద్రబాబుకి చెప్ప దల్చుచుకో లేదు. ఎందుకంటే ఏవో చెక్క ముక్క పతకాలు ఇచ్చి, సాహిత్యానికి ఇస్తున్న ఆ మాత్రం ప్రోత్సాహం కూడా మానుకుని కర్వేపాకు రైతు బిడ్డలకి అమరావతిలో భూములు కేటాయిస్తాడేమో!

**COMMENTS**